బరితెగిస్తే ఖబడ్దార్

- కోడిపందేల కట్టడికి పటిష్ట చర్యలు
- బరుల ధ్వంసానికి కార్యాచరణ



కోడిపందేలు, జూదాలు నిర్వహించరాదంటూ ప్రచారం చేస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

రాయవరం: సంక్రాంతి పండగకు సంప్రదాయం పేరుతో ఏటా కోడిపందేల నిర్వహణకు గ్రామస్థాయిలో నిర్వాహకులు ప్రయత్నాలు చేస్తుంటారు. సంస్కృతి, సంప్రదాయాల పేరుతో కోడిపందాల మాటున జూద క్రీడలు ఆడించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి పండగకు సంప్రదాయం పేరుతో జరిగే కోడిపందేల కట్టడికి పోలీసు శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. పండగ మూడు రోజుల పాటు నిర్వహించే కోడిపందేలు, జూదాలను అడ్డుకోవడంపై పోలీసు, రెవెన్యూ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ మేరకు రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలో పందేలకు బరులు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించడంతో పాటు నిర్వాహకులతో మాట్లాడడం, జూదాలు నిర్వహించిన వారిని బైండోవర్ చేయడం, కోడికత్తుల తయారీ, కట్టేవారిపై ప్రత్యేక నిఘా పెట్టి అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేయడం, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్), పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో పందేల వల్ల కలిగే అనర్థాలను విస్తృతంగా ప్రచారం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

సబ్ డివిజన్ పరిధిలో..

రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి నేటి వరకూ 129 బైండోవర్ చేసి, 453 మందిని మండల మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపర్చారు. అలాగే 10 పేకాట కేసులు నమోదు చేసి, 48 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.48,146 స్వాధీనం చేసుకున్నారు. అలాగే కోడి పందెంపై దాడి చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,250 స్వాధీనం చేసుకున్నారు. రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. కత్తులు తయారు చేసే వారిని గుర్తించి, కోడి కత్తులను కూడా స్వాధీనం చేసుకునే యత్నంలో పోలీసులున్నారు. సారా, నాన్ డ్యూటీ లిక్కర్ రవాణాపై కూడా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.

గ్రామస్థాయి కమిటీలు

సంక్రాంతి పేరుతో నిర్వహించే కోడిపందేలు, జూదాలను కట్టడి చేయడానికి పోలీసుశాఖ గ్రామ స్థాయి కమిటీల సమన్వయంతో పనిచేస్తోంది. ప్రతి గ్రామంలో వలంటీర్లు, సచివాలయ, పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండడంతో ముందస్తుగా బరులను సిద్ధం చేస్తున్న ప్రాంతాలపై సమాచారం సేకరిస్తున్నారు. గతంలో పందేలు వేసిన బరుల స్థల యజమానులకు ముందస్తు నోటీసులిచ్చి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

పెద్ద ఎత్తున ప్రచారం

గ్రామాల్లో పందేలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పందేలను సిద్ధం చేస్తున్న బరులను, పందేలకు అనువుగా ఉన్న స్థలాలను ట్రాక్టర్లతో దున్నించి, ధ్వంసం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. గతంలో పందేలు నిర్వహించిన జూదరులను హెచ్చరించడంతో పాటు, కోడిపందేలు, జూదాల వల్ల కలిగే అనర్థాలపై పెద్దఎత్తున ప్రచారం చేపడుతున్నారు. ఎక్కడ కోడిపందేలు, జూదాలు, సారా తయారీ, అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా 100, 112 లేదా 94407 96507 నంబరుకు ఫోన్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టోల్ ఫ్రీ నంబరు 14500కు కూడా ఫోన్ సమాచారం అందించాలని, పోలీసులు సూచిస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెబుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



సంక్రాంతికి సంప్రదాయం పేరుతో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మందిపై కేసులు నమోదు చేశాం. జూదాల వల్ల కలిగే అనర్థాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. శాంతి భద్రతలను కాపాడడానికి ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలి.

– టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ, రామచంద్రపురం

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి



ప్రజలు అసాంఘిక కార్యక్రమాల వైపు వెళ్లకూడదు. సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, రంగవల్లుల పోటీలు నిర్వహించరాదు. వీటిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు మైకు పెట్టి ప్రచారం చేస్తున్నాం. అసాంఘిక కార్యకలాపాలు, జాతరల పేరుతో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కేసులు నమోదు చేస్తాం.

– జి.నరేష్, ఎస్సై, రాయవరం

క్లుప్తంగా

పండగలు తెలుగు సంప్రదాయానికి ప్రతీకలు

కాజులూరు: తెలుగు సంప్రదాయానికి పండగలు ప్రతీకలని మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు అన్నారు. మండలంలోని మంజేరు, శీల తదితర గ్రామాల్లోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తెలుగు సంస్కృతి, గ్రామీణ పండగలు, సంప్రదాయాలను వివరిస్తూ, వినూత్నరీతిలో ప్రదర్శనలిచ్చారు. సంక్రాంతి పండగ వాతావరణం ఉట్టిపడేలా గొబ్బెమ్మలు పెట్టి, భోగి మంటలు వేసి, జానపద గేయాలు పాడుతూ, నృత్యాలు చేశారు. పలువురు విద్యార్థులు పోటాపోటీగా ముగ్గులు పెట్టి ఆకట్టుకున్నారు. విజేతలకు సర్పంచ్‌లు గుంటూరి అప్పారావు, కోమలి వెంకటరమణ బహుమతులు అందజేశారు.

కోడిపందేల కట్టడికి కమిటీలు

రామచంద్రపురం: హైకోర్టు ఆదేశాల మేరకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందేలు, గుండాటలు, పేకాట వంటి అసాంఘిక చర్యలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఆర్డీఓ ఎస్ సుధాసాగర్ తహసీల్దార్, పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో పండగను నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా, ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు




కుడుపూరులో టీకాల శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ రాంబాబు, డాక్టర్ భావనజ్యోతి

కె.గంగవరం: మండలంలోని కుడుపూరు గ్రామంలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం గురువారం నిర్వహించారు. సర్పంచ్ పిల్లి రాంబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ భావన జ్యోతి ఆధ్వర్యంలో సిబ్బంది, గోపాలమిత్రలు 150 పశువులకు ఉచితంగా టీకాలు వేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాయవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని రామచంద్రపురం డివిజన్ ఈఈ వై.విజయానంద్ గురువారం తెలిపారు. రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలోని రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురబాద, లొల్ల, సోమేశ్వరం, అనపర్తి మండలంలోని మహేంద్రవాడ రోడ్, బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం, పందలపాక, తొస్సిపూడి, కొంకుదురు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డులతో మెరుగైన వైద్యం



నిడసనమెట్టలో ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న జెడ్పీటీసీ

కపిలేశ్వరపురం: ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా మెరుగైన వైద్యం లభిస్తుందని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు అన్నారు. నిడసనమెట్టలో గురువారం ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం, వానపల్లి, వీరవల్లిపాలెం పీహెచ్‌సీల పరిధిలోని 19 గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా కార్డులను అందజేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యులు పి.రత్నకుమారి, నాగాబత్తుల కరుణేంద్రకుమారి, పి.చంద్రమౌళి మాట్లాడుతూ నూతనంగా అందజేస్తున్న ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా వైద్యసేవలు పొందే సమాచారాన్ని పూర్తిగా తెలుసుకోవచ్చన్నారు.

గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన



నేలటూరులో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: నేలటూరులోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి కేటాయించిన ప్లాట్లను త్వరితగతిన నిర్మించుకోవాలని, ప్రభుత్వ సాయం అందిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదలకు మేలు

– కందులపాలెంలో సూర్యప్రకాశ్ పర్యటన



కందులపాలెంలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ గురువారం పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదలకు జరుగుతున్న మేలును వివరించారు. ఏమైనా సమస్య లుంటే తగిన పరిష్కారం చేస్తానని, రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆయనపై పూలజల్లు కురిపిస్తూ.. మహిళలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పెంకే కృష్ణవేణి, ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, పీఏసీఎస్ చైర్మన్ గీసాల శివ, నాయకులు వెంటపల్లి శేషారావు, అనుసూరి వీరబాబు, వాసంశెట్టి శివరామకృష్ణ, వెంటపల్లి రామకృష్ణ, పెంకే వీర్రాఘవులు, గుత్తుల శ్రీనివాసు, వాసంశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

23న పోలమ్మతల్లి ఉత్సవాలు

రాయవరం: పరిసర గ్రామాలకు ఆరాధ్యదైవంగా ఉన్న గ్రామ దేవత పోలమ్మతల్లి ఉత్సవాలను ఈ నెల 23న నిర్వహించనున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఉత్సవాన్ని ఏటా సంక్రాంతి వెళ్లిన అనంతరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా 21 ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాన్ని, 22, 23 తేదీల్లో పోలమ్మ అమ్మవారి జాతర, తీర్థం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 23న జాతరను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలిరానున్నారు.

మహిళల ఖోఖోలో ద్రాక్షారామ ముందంజ



మహిళల ఖోఖోలో గెలిచిన ద్రాక్షారామ సచివాలయం జట్టు



అంగరలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ రామకృష్ణ

రామచంద్రపురం రూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మహిళల ఖోఖోలో గురువారం ద్రాక్షారామ, జగన్నాయకులపాలెం గ్రామ సచివాలయాలు పోటీ పడ్డాయి. ద్రాక్షారామ జట్టు గెలుపొంది, ముందంజలో ఉంది. అదేవిధంగా వాలీబాల్ బాలుర విభాగంలో కాపవరంపై హసన్‌బాద జట్టు గెలిచింది. క్రికెట్‌లో హోరాహోరీగా మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయులు గెద్దం అనురాధ, కోశెట్టి శ్రీనివాస్, ఎ.ఉమ, సీహెచ్ సుజాత, తోట నాగమణి, ఎస్.సత్యనారాయణ, ఎస్.మల్లీశ్వరి, స్వాతి, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పోటీలను పర్యవేక్షించారు. సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, నాగిరెడ్డి సతీష్‌రావు, అంబటి తుకారం, పెమ్మిరెడ్డి దొరబాబు, కోరపు కామరాజు, ఎంపీటీసీ రెడ్నం సతీష్, వార్డు సభ్యుడు యండమూరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

కపిలేశ్వరపురం: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులు మండల స్థాయి కబడ్డీ, ఖోఖో తదితర పోటీల్లో ఆడారు. క్రీడాకారులను అంగర, పడమరఖండ్రిక గ్రామాల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పెద్దిరెడ్డి శేషారత్నం, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు శలా కోటేశ్వరరావు, పసలపూడి శ్రీనివాస్, వాసంశెట్టి వాసు, సంకాబత్తుల స్వామికాపు తదితరులు అభినందించారు. ఆటలను పీఈటీలు ముత్తా సత్యనారాయణ, మేకా సత్యనారయణ, గుబ్బల వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: త్వరలో జరిగే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు, పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రసన్నవిఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో కె.గంగవరం మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. సూర్యప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ బోస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఈ నెల 21న ద్రాక్షారామలో జరిగే సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి, నేరుగా వారి బ్యాంకు ఖాతాలోకే సంక్షేమ పథకాల నగదును అందిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు.

అత్యధిక పింఛన్ల పంపిణీ

ప్రజల కష్టాలను తన పాదయాత్రలో మనస్సుతో చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి అయ్యాక తాను చెప్పిన విధంగా 98 శాతం హామీలను నెరవేర్చారని ఎంపీ బోస్ చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక పింఛన్లు అందజేస్తోందన్నారు. పేదవాడికి అండగా ఉంటున్న వైఎస్సార్ సీపీని గెలిపించుకుని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 21న ద్రాక్షారామలో జరిగే సామాజిక సాధికార యాత్రకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. పార్టీ మండల నేతలు ఒబిలిసేని రాజ్‌కుమార్, పంపన సుబ్బారావు, పెట్టా శ్రీనివాసరావు, పిల్లి రాంబాబు, చిట్టూరి శ్రీను, జుత్తుక శ్యాంప్రసాద్, పోలినాటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- పూజారిపాలెంలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

కొత్తపేట: శివారు గ్రామాలు సహా నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వ నిధులతోనే కాకుండా, వివిధ సంస్థల సహకారం కూడా తీసుకుంటున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పలివెల శివారు పూజారిపాలెంలో నెక్కంటి సీఫుడ్స్ యాజమాన్యం సహకారం రూ.7.50 లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను, దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిధులు సుమారు రూ.2 లక్షలతో నిర్మించిన ప్లాంట్ షెడ్డును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. రూ.20 లక్షల ఎంపీ నిధులు, రూ.10 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు గోరింకల డ్రైన్ పొంగి ప్రవహిస్తే ఈ గ్రామం ముంపునకు గురవుతోందన్నారు. ఇటీవల తుపాను సమయంలో అధికారులతో వచ్చి సహాయక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. పూజారిపాలెం గోరింకల డ్రైన్ నుంచి ఈతకోట–గన్నవరం రోడ్డు వరకూ బీటీ రోడ్డుకు రూ.60 లక్షలు, పూజారిపాలెం నుంచి దేవరపల్లి వరకూ బీటీ రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరు చేయించినట్టు వివరించారు. త్వరలో పనులు ప్రారంభిస్తారన్నారు. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ఇక్కడ అత్యధిక ప్రజానీకానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేశామన్నారు. దాదాపు రోడ్లన్నీ ఆధునీకరించామని, మిగిలినవి కూడా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీటీసీ గునిపే శ్యామల, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పానుగుపాటి సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు తులా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకల్ప కార్యక్రమాలు

కపిలేశ్వరపురం (మండపేట): విజయవాడలో స్వరాజ్ మైదానంలో నెలకొల్పిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణను పురస్కరించుకుని కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల సచివాలయాల్లో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించి సంకల్ప సూచకంగా సంతకాలు చేశారు.

మండపేటలో..

పట్టణంలోని 8వ సచివాలయంలో కౌన్సిలర్ గ్రంథి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. దేశానికి భవిష్యత్ మార్గాన్ని చూపిన అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. నిర్దేశించిన బ్యానర్‌పై చైర్‌పర్సన్, సచివాలయ ఉద్యోగులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, సచివాలయ కన్వీనర్లు గనిపే భూషణం, పేరూరి మాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి రామారావు, గృహ సారథులు మోర్త లక్ష్మి, కొమ్మోజు నాగేశ్వరరావు, సేనాపతి దొరబాబు పాల్గొన్నారు.



మండపేటలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ పతివాడ

ఇప్పనపాడులో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గెద్దం గాంధీబాబు, త్రిశూల శ్రీను, గంగాధర్, వనుం సత్యవేణి పాల్గొన్నారు. కేశవరం గ్రామ సర్పంచ్ పీవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఆయన భారీ విగ్రహం సంకల్ప బలానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ సీనియర్ నాయకులు పెదపాటి సీతారాం, మంగాపతి, ఉమా మహేశ్వరరావు, అద్దంకి రమణ, పెదపాటి చంద్రరావు, పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు సంతకాల సేకరణ

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు మహోన్నత నివాళి అర్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలో ఈ నెల 19న ఆవిష్కరిస్తున్న 125 అడుగుల కాంస్య విగ్రహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్న సంకల్పంతో గ్రామాల్లో సంతకాల సేకరణ చేపట్టారు. యనమదల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, గ్రామ పెద్దలు, దళిత నాయకులు పాల్గొన్నారు. హసన్‌బాదలో పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



యనమదలలో సంతకాల సేకరణ చేస్తున్న సర్పంచ్ వెంకటరమణ తదితరులు

గాలికుంటు నివారణకు టీకా తప్పనిసరి

ఆలమూరు: మూగ జీవాలకు సంక్రమించే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండి, పశు వైద్యుల సూచనలు పాటించడం ద్వారా మేలైన పశు గణాభివృద్ధిని సాధించవచ్చని ఆలమూరు పశు సంవర్ధక శాఖ ఏడీ డా.ఎల్.అనిత అన్నారు. ఆలమూరులోని ఏడీ కార్యాలయ ఆవరణలోని పశువుల ఆస్పత్రిలో గురువారం సర్పంచ్ నేలపూడి లావణ్యతో కలిసి గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఏడీ అనిత మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. ఈ నెలాఖరు వరకూ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆలమూరు సబ్ డివిజన్‌లోని 19 పశువుల ఆస్పత్రుల పరిధిలో 20 వేల టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చూడి పశువులు, ఈనిన పశువులను తప్పించి, నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు విధిగా టీకా వేయించాలన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఆర్డీఓ సుధాసాగర్

రామచంద్రపురం: నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం ఆర్డీఓ, ఎన్నికల అధికారి ఎస్ సుధాసాగర్ పోలీసు అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ఎన్నికల సెక్టార్ అధికారులతో గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం, ద్రాక్షారామ పోలీసుస్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు హాజరయ్యారు. ఆర్డీఓ సుధాసాగర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూలు ప్రారంభం నుంచి, ఎన్నికలు ముగిసే వరకూ పోలింగ్ అధికారులు, పోలీసులు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల విషయమై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లో కనీస సౌకర్యాలైన తాగునీరు, వెబ్‌కాస్టింగ్, ఎలక్ట్రిసిటీ, భవనాల్లో ఫర్నిచర్, భవనం పరిస్థితి, ర్యాంప్‌లు పరిశీలించి, ఎన్నికల నిర్వహణకు అవకాశం లేకపోతే వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల పరిధిలో ఎలాంటి పార్టీ కార్యాలయాలు, ఇంటర్నెట్ సెంటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 80 ఏళ్లు పైబడిన వారు, బెడ్ రెస్ట్, అంగ వైకల్యం ఉన్న వారి వివరాలు సేకరించి, వారు ప్రత్యేకంగా ఓటు వేసే ఏర్పాట్లు చేయాలన్నారు. దివ్యాంగ ఓటర్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెక్టారు ఆఫీసర్లు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్దకు ఈవీఎంలతో బస్సు వెళ్లేలా రోడ్డు మార్గం అనుకూలంగా లేకపోతే, వెంటనే నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ ఆదేశించారు.



ఎన్నికల సెక్టార్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సుధాసాగర్

సహకరిస్తూ.. సేవలందిస్తూ..

- ప్రజలకు అందుబాటులో వలంటీర్లు
- స్థానికులతో ప్రత్యేక అనుబంధం
- ఇదే బాటలో సచివాలయ ఉద్యోగులు

రాయవరం: ప్రజల ముంగిళ్లలోకే ప్రభుత్వ సేవలు అందించేలా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ప్రశంసలు అందుకుంటోంది. ప్రజలకు నేరుగా సేవలందించడంతో పాటు ఆపదలో ఉన్న వారి చెంతకే వెళ్లి ఆపన్నహస్తం అందిస్తున్నారు. లబ్ధిదారులు ఎక్కడున్నా వారి వద్దకు వెళ్లి పింఛను సొమ్మును అందిస్తూ వలంటీర్లు వారి సేవాభావాన్ని చాటుకుంటున్నారు. వలంటీర్లతో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మేము సైతం అంటూ కదులుతున్నారు. పలువురు వలంటీర్లు హైదరాబాదు, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర దూర ప్రాంతాలకు వెళ్లి మరీ లబ్ధిదారులకు పింఛను అందిస్తున్నారు.

ప్రతి సచివాలయం నుంచీ...

రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటు, ఆరు మండలాల పరిధిలో సచివాలయాలున్నాయి. సచివాలయాల పరిధిలో వలంటీర్లు పనిచేస్తున్నారు. ఆయా సచివాలయానికి సంబంధించి ప్రతి నెలా ఒకరు లేదా ఇరువురు పింఛనుదారులకు దూర ప్రాంతాలకు వెళ్లి వలంటీర్లు సొమ్ము అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుని వచ్చిన వలంటీర్ వ్యవస్థ ప్రజలకు బాగా చేరువైందని చెప్పడానికి వలంటీర్ల సేవలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

మండలం	గ్రామాలు	సచివాలయాలు	వలంటీర్లు
రాయవరం	12	19	406
మండపేట	12	23	505
మండపేట అర్బన్	14	14	264
కపిలేశ్వరపురం	19	20	309
కె.గంగవరం	26	23	397
రామచంద్రపురం	25	21	476
ఆర్‌సీపీఎం అర్బన్	12	12	203
కాజులూరు	26	23	452



పింఛనును అందజేస్తున్న వలంటీర్లు

ఆప్యాయతను పంచుతూ..

దూర ప్రాంతంలో ఉన్న లబ్ధిదారులైన అవ్వాతాత తదితరులకు పింఛను అందించడానికి వెళ్లిన వలంటీర్, సచివాలయ ఉద్యోగులు వారి ఆప్యాయత, అనురాగాలు చూపుతున్నారు. దీంతో తమ కోసం వచ్చిన వలంటీర్లను చూసిధారులు చెమర్చిన కళ్లతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం గుర్తించి ఏటా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరిస్తోంది. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేలా ప్రోత్సహిస్తోంది.

సంతృప్తిగా ఉంది



సేవాభావంతోనే వలంటీర్‌గా పనిచేస్తున్నా. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం సంతోషం ఉంటుంది. పింఛను తీసుకోవడానికి రాలేని వారి కోసం దూర ప్రాంతానికి వెళ్లి వారికి అందజేయడం సంతృప్తిగా ఉంటోంది. గతంలో విశాఖపట్నం తీసుకుని వెళ్లి పింఛను ఇవ్వడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇప్పటికే మూడు సార్లు సేవా మిత్ర అవార్డును పొందాను.

– షేక్ సుభాన్‌బీ, రాయవరం

కళ్లల్లో ఆనందాన్ని చూశా



నెలవారీ పింఛన్‌పైనే ఆధారపడిన వారికి ఆ నెల పింఛను పొందలేకపోతే చాలా ఇబ్బంది పడతారు. అనారోగ్యంతో ఆస్పత్రిలోనో, దూర ప్రాంతంలో ఉన్న వారికి పింఛను ఇస్తున్న సమయంలో వారి కళ్లల్లో ఆనందం చూశాను. నాకు కూడా చాలా సంతోషం కలిగింది. గతంలో విశాఖపట్నం వెళ్లి పెన్షన్ అందజేశాను. 2021 రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో ఉత్తమ సేవా పురస్కారం పొందాను.

– బాదంపూడి దుర్గాసాయిరామ్, ఏడిద, మండపేట